


నేడు గుంకలాంకు పవన్ రాక

ప్రజాశక్తి- విజయనగరం

జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదివారం జిల్లాకు రానున్నారు. 'జగనన్న ఇళ్లు..పేద ప్రజల కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్మితమవుతున్న జగన్న కాలనీలను జనసేన పరిశీలించి పేదల కష్టాలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే అతి పెద్ద కాలనీగా గుర్తింపు పొందిన గుంకలాం జగనన్న కాలనీని ఆయన ఆదివారం పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10.30గంటలకు విశాఖ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో విజయనగరం చేరుకుంటారు. ఆర్అండ్‌బి, కలెక్టరేట్ మీదుగా ద్వారపూడి మీదుగా గుంకలాం చేరుకుంటారు. ఈ కాలనీను సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించడం, అదే కాలనీలో ప్రజలు కష్టాలను పవన్ తెలుసుకోవడానికి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పోరాటమే ఆయుధం... సమస్యలు పరిష్కారం

సమస్యలే పరిష్కారం... పోరాటాలే ఆయుధంగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా మూడోమహాసభ ఆదివారం పాలకొండలో జరుగనుంది. గతంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చేసిన పోరాట ఫలితాలను సమీక్షించుకొని భవిష్యత్తులో చేపట్టాల్సిన ఉద్యమాలు, కర్తవ్యాల్ని ప్రణాళికలు చేసుకొనేందుకు ఈ మహాసభ వేదిక కానుంది.

నేడు ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మూడో మహాసభ



ఆప్కాస్‌కు నిరసనగా పాలకొండలో ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు మున్సిపాలిటీలో పరిధిలో గల లక్షా 80వేల మంది ప్రజలకు 450మంది కార్మికులు పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. వీరంతా సిఐటియు ఆధ్వర్యాన అనేక సమస్యలపై పోరుబాట పడుతున్నారు. ప్రధానంగా జిఒ 279 రద్దు కోసం గత చంద్రబాబు ప్రభుత్వంతో మున్సిపల్ కార్మిక వర్గం యుద్ధమే చేసింది. ఆ పోరాటానికి జడిసి ఆ జిఒను రద్దుచేసిన వైసిపి ప్రభుత్వం పాత సీసాలో కొత్తసారా అన్నట్టుగా ఆప్కాస్ విధానాన్ని తెచ్చింది. ఇందులో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ, ఆర్‌టిఎంఎస్, జియో ట్యాగ్, ఇంటింటి ఎఫ్ఆర్ఎస్ వంటి అదనపు పనులు అమలు చేసింది. ఇది కార్మికులకే కాకుండా ప్రజలకు కూడా తీవ్ర నష్టం చేకూరుస్తోంది.

ఆప్కాస్ విధానం వల్ల 60ఏళ్లకే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తుంది. చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వని పరిస్థితి ఉంది. ఈ విధానాన్నిరద్దు చేయాలని పారిశుధ్య కార్మికులు నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. పారిశుధ్య కార్మికులను సచివాయాలకు బదిలీ చేయాలనే వైఎస్‌పి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్వతీపురం, సాలూరు, పాలకొండలో కార్మికవర్గం తిరగబడింది. ఓవైపు పట్టణాల్లో జనాభా పెరుగుతున్నా అందుకు తగ్గట్టు కార్మికులను భర్తీ చేయకుండా పని ఒత్తిడి పెంచుతోంది. ఖాళీ పోస్టులు భరీ చేయకపోవడంతో ఉన్న కార్మికులపై పనిఒత్తిడి తీవ్రంగా పెరిగింది. ఇప్పుడు కార్మికులను సచివాయాలను అనుసంధానం చేసి మరింత శ్రమ దోపిడీ చేయాలని చూస్తోంది. అందుకే ఈ విధానంపై పోరాటం కొనసాగుతుంది.

కరోనాను ఎదురించి... ప్రభుత్వంతో పోరాడి...

దాదాపు రెండేళ్ల ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మున్సిపల్ కార్మికులకు పరీక్ష పెట్టింది. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన కార్మికుల ధైర్య సాహసాలను ప్రజలు ఎంతో మెచ్చుకున్నారు. కరోనా మహమ్మారికి పార్వతీపురంలో ఒకరు, సాలూరులో ఒకరు బలయ్యారు. వీరి స్థానాలను కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని యూనియన్ పోరాటాన్ని కొసాగిస్తోంది.

వేధింపులు... పోరాటాలు

సాలూరులో మున్సిపల్ కార్మికులను ఆఫీసు ఉద్యోగిని వేధిస్తే సంఘం పోరాడింది. మున్సిపల్ జోనల్ డైరెక్టర్ వరకూ విషయాన్ని తీసుకెళ్లారు. పోరాట ఫలితంగా వేధింపుల ఉద్యోగిని సస్పెండ్ చేశారు. కార్మికవర్గం అనేక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు యూనియన్ అండగా నిలుస్తోంది. కరోనాలో కోవిడ్ బాధిత కార్మికులకు బియ్యం, పప్పులు అందించింది. విజయనగరంలో కార్మికుడ్ని సస్పెండ్ చేస్తే సంఘీభావం తెలిపింది. ఇలా యూనియన్ కార్మికుల పక్షాన నిరంతరం పనిచేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ఉద్యోగ భద్రత, ఇంజినీరింగ్ కార్మికులకు కనీసవేతనం రూ.21వేలు చెల్లించాలని తదితర సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సన్నద్ధం కానుంది.

మహాసభ విజయవంతం చేయాలి

పాలకొండ : ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పట్టణ కమిటీ గౌరవాధ్యక్షులు దావాల రమణరావు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాలకొండ పట్టణంలోని కోట దుర్గ కళింగ కోమటి కళ్యాణ మండపంలో ఆదివారం ఈ సభ జరగనుందన్నారు. మహాసభకు రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు పి. వెంకటరెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. జిల్లా పరిధిలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ పట్టణాలకు చెందిన కార్మికులు హాజరౌతారన్నారు. పాలకొండలో మహాసభలు నిర్వహించడం ఈ ప్రాంత కార్మికులకు స్ఫూర్తినిస్తాయని, కార్మిక సమస్యలతో పాటు ప్రజా సమస్యలు పరిష్కారానికే భాగస్వాములు అవటానికి ఉపయోగపడతాయని అన్నారు. సమావేశంలో అధ్యక్షులుభాస్కరరావు, కార్యదర్శి చింతల సంజీవి, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కోశాధికారి పడాల వేణు కార్యవర్గసభ్యులు చింతల శ్రీదేవి తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి

- జిల్లా ఆస్పత్రి ఎదుట సిపిఎం, టిడిపి నాయకుల ధర్నా
- నాలుగు నెలల్లో ఏనుగులను తరలిస్తాం : డిఎఫ్‌ఒ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కొమరాడ మండలం కళ్లికోటలో శుక్రవారం అర్ధరాత్రి ఏనుగు దాడిలో మృతి చెందిన గోవింద్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి అటవీశాఖ బాధ్యత వహించాలని కోరుతూ శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రి ఎదుట కొమరాడకు చెందిన సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, టిడిపి నాయకులు దేవకోటి వెంకటనాయుడు, నంగిరెడ్డి మధుసూధనరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ, ఆస్తి, పంట, ప్రాణ నష్టాలకు పాల్పడుతున్న ఏనుగుల గుంపును ఇక్కడి నుంచి ఎక్కడికైనా సురక్షిత ప్రాంతాలకు తరలించే బాధ్యత ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పెద్దఎత్తున జరిగిన ఈ నిరసనను ఆపాలని సిఐ విజయానంద్ ఆధ్వర్యంలో పోలీసు బృందం నిరసన కారులను కోరారు. ఇందుకు వారు మాట్లాడుతూ జరిగిన నష్టానికి వెంటనే కలెక్టర్‌గానీ, జిల్లా అటవీశాఖ అధికారులుగానీ సమాధానం చెప్పేంత వరకూ పోస్టుమార్టం గది నుంచి మృతదేహాన్ని కదల్చమని, మేమూ ఇక్కడి నుంచి కదలమని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు సమాచారాన్ని అధికారులకు ఫోన్‌లో వివరించగా, స్పందించిన అటవీశాఖ జిల్లా అధికారి ప్రసన్న అసుపత్రికి చేరుకుని ధర్నానుద్దేశించి మాట్లాడారు. నాలుగు నెలల్లో ఏనుగులను తరలించేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే చర్యలు చేపడతామని, అటవీచట్టాలను అనుసరించి బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారంతో పాటు, వారి కుటుంబంలో ఎవరికైనా ఒకరికి ఔట్‌సోర్సింగ్ పోస్టు ఇచ్చి అదుకుంటామని హామీ ఇచ్చారు. వన్యప్రాణులు జరిపిన ఈ నష్టాన్ని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. అనంతరం వారి కుటుంబసభ్యులతో నిరసనకారులు మాట్లాడిన అనంతరం ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో పార్వతీపురం, కురుపాం రేంజర్లు త్రినాథ్, రాజబాబు పాల్గొన్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డిఎఫ్‌ఒ ప్రసన్న

ఏనుగు దాడిలో రైతు మృతి

కొమరాడ : ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కళ్లికోటకు చెందిన దాసరి గోవింద (47) శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్తున్న సమయంలో ఏనుగు దాడి చేసి చంపేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. మండలంలో గత ఐదున్నరేళ్లుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు బారినపడి మృతిన వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. మనుషులు, జంతువులు ప్రాణాలతో పాటు పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అధికారులు ఏనుగులు తరలించాల్సినప్పటికీ ప్రేక్షకు పాత్ర వహించడండంతో అనేక నష్టం జరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏనుగుల బారినపడి నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : డివైఎఫ్ఐ

విజయనగరం : విశాఖ ఉక్కుని ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విభజన హామీలు అమలు చెయ్యాలని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్. హరీష్, ఎస్. రుద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు ఏ మొహం పెట్టుకుని వచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయే సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు ప్రకటించినా నేటివరకూ అమలు చేయలేదని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, విభజన హామీలు అమలు చేయాలని నిరసనలు చేస్తున్న కార్మికులపై,ప్రజా సంఘాల నాయకును ముఖ్యమంత్రి అరెస్టులను చెయ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

సమిష్టిగా తోటపల్లి దేవస్థానం అభివృద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి సభ్యులంతా సమిష్టిగా ఉంటూ చర్యలు చేపట్టదామని దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారపురెడ్డి ధనుంజయనాయుడు అన్నారు. 112 మంది సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయనాయుడు మాట్లాడుతూ చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి దేవస్థానం నేడు ఇలా ఉండడం బాధాకరమన్నారు. జిల్లాలో తోటపల్లి దేవాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావాలని పర్యాటక రంగంలో కూడా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ పారినాయుడు మాట్లాడుతూ సభ్యులుగా చేరిన వారు అనువంశిక ట్రస్టులుగా కొనసాగుతారని ఒక్కొక్క ట్రస్టీ రూ.10,116 చెల్లించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తం నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరుగుతుందని వచ్చిన వడ్డీతో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తోటపల్లి దేవస్థానం నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం దేవస్థానం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్‌గా ద్వారపురెడ్డి ధనుంజయనాయుడు, కో-మేనేజింగ్ డైరెక్టర్లుగా జగన్నాథ రథో, పొట్నూరి గౌరీశంకర్, ఆవాల కన్నయ్య,ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా డి.పారినాయుడు, కో-ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా గుడ్ల హరిప్రసాద్, బి.నాగభూషణరావు, ఎం.సింహాచలం, కోశాధికారి ఎం.ఫకీరునాయుడు, డైరెక్టర్లుగా అంబటి గౌరినాయుడు, ప్రకాశరావు, అంబటి రాంబాబు, పాలకోదేటి రామలక్ష్మి, మజ్జి సుధ, ప్రకాష్‌రావు, కిమిడి రామచంద్రరావు, సాయి కిరణ్, తిరుపతినాయుడు, ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా అంధవరపు కోటేశ్వరరావు, సాంస్కృతిక కార్యక్రమాల చైర్మన్ వేమల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

ఇంతకీ ఎవరా దొంగలు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



'ఇంతకీ ఎవరా దొంగలు.... ఉద్యోగాలపేరిట బురిడీ కొట్టిస్తున్న ఆ ముఠా ఎక్కడి నుంచి వచ్చింది. ఏకంగా ప్రభుత్వ శాఖలు, అందులోని అధికారుల పేర్లనే వాడేసుకుంటున్నారా? చదువుకున్న నిరుద్యోగు లను అంత ఈజీగా ఎలా మోసం చేయగలుగుతున్నారు? ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మోసపోవద్దంటు న్నారే తప్ప ఆలా మోసాలకు పాల్పడుతున్న వారెవరు? అన్నది ఎందుకు బయటపెట్టలేక పోతున్నారు?' ఇదీ జిల్లాలో గడిచినవారం రోజులుగా జనాల్లో సాగుతున్న చర్చ. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! మొన్న జిల్లా కలెక్టర్, నిన్న ఎపిసి, నేడు డిఎంఅండ్‌హెచ్ఒ వరుస ప్రకటనలు కలకలం రేపుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తనపేరున ఫేక్ అకౌట్లు ఓపెన్‌చేసి ఆర్థిక సాయం కోరుతున్నారని, బంధువులం, స్నేహితులం అంటూ ఉద్యోగాలపేరిట వసూళ్లకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని నమ్మ వద్దని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ గత నెల 14న ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 4న 'దళారులనుగానీ, మధ్యవర్తులను గానీ నమ్మి మోసపోవద్దు, తమ ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి నియామకాలూ చేపట్టలేదు, నోటిఫికేషన్లు కూడా విడుదల చేయలేదు' అంటూ సమగ్ర శిక్ష ఎపిసి (అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్) మరో ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కూడా ఒక పత్రికలో వచ్చిన వార్తపై స్పందిస్తూ ఆ 587 పోస్టులకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదని, దళారులను నమ్మి మోసపోవద్దని సలహా ఇచ్చారు. దీన్నిబట్టి నిరుద్యోగతను ఆసరా చేసుకుని, ఉద్యోగాల కల్పన పేరుతో భారీగా వాసూళ్లకు పాల్పడుతు న్నట్టు అర్థమౌతోందని పబ్లిక్ టాక్. జిల్లాలో అపారమైన వనరులు ఉన్నా వాటిని పాలకులు వినియోగంలోకి తేలేదు. ముఖ్యంగా జిల్లాలో 80శాతం కుటుంబాలు ప్రత్యక్షంగాను, పరోక్షం గానూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడినవే. సాగునీటి వసతులు పెద్దగా లేకపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్న సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. దీంతో, వ్యవసాయ కుటుంబాల్లోని చదువు కున్న యువతంతా చిన్నపాటి ఉద్యోగాలు, ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యానం, పశుపోషణలోనూ ప్రభుత్వాల ప్రోత్సహం అంతంతమాత్రమే. ఆ సబ్సిడీలు ఆమాయకు లైన పేదలకు అందే పరిస్థితి లేదు. మరోవైపు ఉన్న జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ప్రభుత్వ విధానాలవల్ల మూత పడ్డాయి. కొత్త పరిశ్రమలు రాలేదు. మిగిలిన రంగాల్లోనూ జిల్లాలో పెద్దగా పురోగతి కనిపంచడం లేదు. దీంతో, చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. కొంతమంది వలసపోలేక, కుటుంబ బాధ్యత మోయలేక సతమతమౌతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు నిరుద్యోగులకు టోకరా వేస్తున్నట్టుగా అర్థమౌతోందని చాలా మంది అభిప్రాయపడు తున్నారు. ఇదేదో ప్రైవేటు కంపెనీల్లోనూ, ఎక్కడో తెలియని ప్రాంతంలోనే ఇటువంటి మోసాలు జరిగితే అది వేరు. సాక్షాత్తు ప్రభుత్వ శాఖల్లోనే ఉద్యోగాలిస్తామని మోసం చేయడం, వాటిపై అధికారులు ప్రకటనలు ఇవ్వడం పట్ల ఏర్పడుతున్న అనుమానాలు పెనుభూతంగా మారుతు న్నాయి. ఇలా నిరుద్యోగులను తమ శాఖల్లో ఉద్యోగాలు పేరిట మోసం చేస్తున్నారని తెలుసుకున్న అధికారులు ఇటువంటి పరిస్థితిని నియంత్రించేందుకు ఎందుకు కంకణం కట్టుకోవడం లేదో అంటూ చాలా మంది ప్రశ్నిస్తున్నారు. ఔను కదూ..! జనం చర్చించు కుంటున్నట్టు నిరుద్యోగులు మోసపోతే వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యతగానీ, అలా మోసం చేసినవారిని పట్టుకుని శిక్షించే అధికారంగానీ అధికార యంత్రాంగానికి లేదా? మరీ పట్టనట్టుగా ఆత్మరక్షణలో పడినట్టు ప్రకటనలు, హెచ్చరికలతో సరిపెడితే ఎలా? అని కూడా చర్చసాగుతోంది. అధికారుల ప్రకటనలను బట్టి జిల్లాలో నిరుద్యోగులను పథకం ప్రకారం మోసం చేస్తున్నారన్న విషయం బయట పడింది. అధికారులకుగానీ, జిల్లాలోని పాలకులకుగానీ చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా అటువంటివారిని పట్టుకుని శిక్షించాలని పలువురు కోరుతున్నారు. ఇంతకీ పాలకులు ఏం చేస్తున్నట్టు? సందుదొరికితే అధికారులను నిలదీసే ప్రజాప్రతినిధులు నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంటే ఏమైపోయారు? ఎంత కాలంగా ఇలా నిరుద్యోగులు మోసపోవాలి? అధికారుల ప్రకటనలను బట్టి నిరుద్యోగుల నుంచి కోట్ల రూపాయాలు టోకరా వేస్తున్నట్టుగా అర్థమౌతుందని పలువురి వాదన. ఇప్పటికైనా స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.



పార్వతీపురంలో అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాలరావు

లోక్‌అదాలత్‌లో 1727 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పార్వతీపురంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1727 కేసులు పరిష్కారమైనట్లు న్యాయస్థాన వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. రెండో అదనపు జిల్లా జడ్జి సిహెచ్ రాజగోపాలరావు, సీనియర్ సివిల్‌జడ్జి జి.యజ్ఞనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య ఈ ఆదాలత్ నిర్వహించారు. ఇందులో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు 1414, అడ్మిషన్ కేసులు 215, సివిల్ దావాలు 23, ఐపిసి కేసులు 49, ఎన్ఐ యాక్ట్‌కేసులు 5, డివిసి 1, అప్పీలు1, ఎంవిఒపి 5, లేబర్ ఆఫీసు 13, లిటిగేషన్1 కేసులు పరిష్కరించారు. వీటి ద్వారా రూ.8,50,456 అపరాధ రుసుంగా వసూలైనట్లు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, పోలీసు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : రాజీయే రాజమార్గమని పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి అగ్గాల విజయరాజ్ కుమార్ అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ పురస్కరించుకొని శనివారం పలు కేసులను రాజీ చేయించి పరిష్కరించారు. కేసులు రాజీ పడటానికి మెగా లోక్ అదాలత్ సరైన వేదికని, రాజీయే రాజమార్గమని, కేసులు రాజీ అవడం వల్ల ఇరు వర్గాల వారికి శ్రేయస్కరమని చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్ అదాలత్ ద్వారా ఎన్నో కేసులు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.విజయలక్ష్మి, పాలకొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. సత్యనారాయణ, ఎజిపి చందక జగదీష్, సీనియర్ న్యాయవాదులు అల్లిన గోవిందరాజులు, కర్రా రవి, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.చంద్రమౌళి, బత్తినమోహన్ పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందిపై చర్యలేవీ?

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండల కేంద్రమైన జియ్యమ్మవలసలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ సిబ్బందిపై స్థానికంగా విచారణ జరిగింది. ఈ విచారణలో పనికి వెళ్లకుండా మస్తర్లు వేసి లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడినట్టు రుజువైనప్పటికీ ఇంతవరకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు భూతాల మోహనరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.సీతారాం, బొడ్డవలస వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుంపస్వామి ప్రశ్నించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ తోటపల్లి సుజాత ఈ విచారణలోనే కాకుండా సోషల్ ఆడిట్‌లోనూ అవతవకలకు పాల్పడినట్టు విచారణలో వెల్లడైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ఎఎన్ఎం, విఒఎ పేరున ఎన్ఎంఆర్‌లు రాసినట్లు సోషల్ ఆడిట్‌లో రుజువైందన్నారు. అయినా ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోకుండా స్థానిక వైసిపి నాయకులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకొని కాపాడుతున్నారని అన్నారు. సోషల్ ఆడిట్ గ్రామ సభలో వీరిని కాపాడ్డానికి భూతాల మోహనరావుతో గొడవ పడ్డారని అన్నారు, ఫీల్డ్‌అసిస్టెంట్‌ను అడ్డు పెట్టుకొని రాజకీయ నాయకులు, కొంత మంది మేట్లు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని, వీరికి వైసిపి నాయకుల అండదండలు ఉన్నాయని అన్నారు. మండలంలో ఏ అవినీతి జరిగినా ఆ అధికారులను కాపాడడం వైసిపి నాయకులకు అలవాటైపోయిందని విమర్శించారు. మండలంలో రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఉన్నప్పటికీ ఎంపిడిఒ విజయలక్ష్మి ఎటువంటి తీర్మానాలు, బిల్లులు లేకుండా డబ్బు డ్రా చేశారని సాక్ష్యాత్తు ఆ పార్టీ ఎంపిపి బొంగు సురేష్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదుపై జెడ్‌పి సిఇఒ విచారణ జరిపి అక్రమాలు జరిగినట్టు నివేదిక ఇచ్చినా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటే ఈ అవినీతి, అక్రమాలు వెనక ఎవరు వున్నారు? అవినీతి అధికారులను ఎవరు కాపాడుతున్నారని ప్రశ్నించారు. మరోవైపున రాష్ట్రంలో అవినీతి రహితపాలన అందిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతుంటే మరో పక్క మండలంలో భారీస్థాయిలో అవినీతి పాలన సాగుతున్నప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోవడం చూస్తే ప్రకటనలు, ఆచరణకు పొంతన ఎక్కడుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దృష్టి సారించి ఫీల్డ్‌అసిస్టెంట్‌ను రిమూవ్ చేసి మిగిలిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున మండలంలోని అవినీతిపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



తహశీల్దార్ కార్యాలయం కూడలి వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మోడీ సభకు బస్సులు... ప్రయాణికులకు తిప్పలు

ప్రజాశక్తి - సాలూరు

విశాఖలో శనివారం దేశ ప్రధాని మోడీ సభకు జనాలను తరలించడానికి ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులను చాలా వరకు విశాఖ సభకు జనాలను తరలించేందుకు వినియోగించారు. దీంతో సాధారణ ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఆర్టీసి అధికారులు ఏవిధమైన ప్రకటన చేయకపోవడంతో ప్రజలు ఎప్పటిలాగే ప్రయాణాలకు సిద్ధమయ్యారు. సమయానికి బస్సులు రాకపోవడంతో బస్టాప్‌ల వద్ద గంటల తరబడి నిరీక్షించారు. ఫాసింజరు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్నింటినీ విశాఖ సభకు జనాలను తరలించడానికి వినియోగించడంతో ప్రయాణీకులు ఖంగుతిన్నారు. సాలూరు నుంచి విశాఖ వరకు లగ్జరీ బస్సులు మాత్రమే నడపడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు ఇబ్బంది పడ్డారు. దీనిపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వై నాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను మోడీ సభకు జనాలను తరలించేందుకు వాడతామని ముందస్తుగా ఆర్టీసీ అధికారులు ప్రకటన జారీ చేయకపోవడం దారుణమని అన్నారు. దీనివల్ల ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించా రని చెప్పారు. ప్రజల సంపదను కార్పోరేట్లకు పంచడానికి మోడీ విశాఖ వచ్చారా అన్ని ఎద్దేవా చేస్తున్నారు.

130 ఇళ్లు... 100 నాటుబళ్లు

- ఇసుక అక్రమార్కులకు కాసులు
- నాటుబళ్లు ముసుగులో యథేచ్ఛగా అమ్మకాలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసులు

ప్రజాశక్తి-డెంకాడ

ఇసుక ..అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నాటు బళ్లతో ఇసుకను తోలుకునేందుకు అనుమతులు ఉండడంతో అక్రమార్కులకు అది వరంలా మారింది. నదుల నుంచి నాటు బళ్లతో ఇసుక తోలి.. ఒకచోటు నిల్వచేసి లారీలు, ట్రాక్టర్లతో పట్టణాలకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు.

మండలంలో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీలకు మండలంలో ఒక దగ్గర స్టాక్ పాయింట్ పెట్టి ఇసుకను సరఫరా చేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఓ పక్క ప్రకటన చేస్తుంటే మరోపక్క ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. చంపావతి నది పక్కన ఉన్న గ్రామాలకు చెందిన కొంతమంది నాటు బళ్లు కొని తమ గ్రామాల వద్ద ఇసుకను స్టాకు చేసుకొని రాత్రుల సమయంలో ట్రాక్టర్లు, లారీలతో ఇసుకను వేలాది రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నాటుబళ్లతో ఇసుకను ఇల్లు నిర్మించుకున్న వారే వినియోగించు కోవాలన్న నిబంధన ఉన్నా అలా జరగడం లేదు. మండలంలోని చొల్లంగిపేట నుంచి నాతవలస వరకు చంపావతి నది పక్కన ఉన్న గ్రామాల వారంతా నాటుబళ్లతో ఇసుకను తరలిస్తున్నారు. చొల్లంగిపేట పంచాయతీ పోతయ్యపాలెంలో సుమారు 130 ఇళ్లు ఉన్నాయి. అయితే ఈ గ్రామంలో సుమారుగా 100 నాటు బళ్ళు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఈ నాటుబళ్లతో నిత్యం చంపావతిలో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు గ్రామంలో ఒక్కొక్కరు ఒకచోట స్టాకును ఏర్పాటు చేసుకొని రాత్రి పూట ట్రాక్టర్లకు, లారీలకు ఈ ఇసుకను వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఈ విషయం రెవిన్యూ పోలీస్ అధికారులకు తెలిసిన పట్టించుకోవడంలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ రెవిన్యూ యంత్రాంగం కలగజేసుకొని ఇసుకస్టాక్ పాయింట్లు స్వాధీనం చేసుకొని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాలలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎల్విన్ పేట సిఐ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొండవాడ గిరిజన పంచాయతీలో మన ఊరు- మన పోలీస్ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా అమ్మకాలు ఉండకూడదని, చట్టాలపై అవగాహన ఉండాలని చెప్పారు. మూఢనమ్మకాలు వల్ల కలుగు అనర్థాలు, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. చదువుకున్న యువత శిక్షణా కార్యక్రమాలకు వెళ్లి, ఉపాధి కల్పనా చర్యలు చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖరావు, తదితర గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.

యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మండలంలోని కేదారిపురంలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపిక పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

సీతంపేట : జాతీయ గౌరవ దివాస్ ట్రైబల్ ఫ్రైడే సందర్భంగా సీతంపేట క్లస్టర్ లెవెల్లో క్రీడల ఎంపికలు సీతంపేట ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో శని వారం నిర్వహించారు. 22 స్కూల్ నుండి 600 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ ఆటలను నిర్వహించారు. వీటిలో ఎంపికైన వారిని ఈ నెల 15వ తేదీన జిల్లాస్థాయి ఇదే చోట జరగనున్న పోటీల్లో తలబడనున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈ నెల 19, 20, 21లలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికవుతారని ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్, రాష్ట్ర క్రీడా నిర్వహణ బాధ్యులు ఎన్ జాకప్ దయానంద్ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో ఐడిటిఎ ఎపిఒ రోషిరెడ్డి, ఎటిడబ్ల్యుఒ మంగ వేణి, హెచ్‌ఎం ఆరిక భాస్కర రావు, ఎఎంఒ కోటిబాబు పీడీలు కళ్యాణి వెంకటరమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు 11మంది ఎంపిక

సీతానగరం : మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు డివిజన్ స్థాయిలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివం నాయుడు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్ పోటీల్లో గెలుపొందారని తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

వీరఘట్టం : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుండి 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి యం. వెంకటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. 14న జవహర్లాల్ నెహ్రూ జయంతి, 15న పుస్తక ప్రదర్శన, 16న జాతీయ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్సార్ రంగనాథ్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య స్మరించుకోవడం, 17న చిత్ర లేఖనం పోటీలు, 18న వ్యాసరచన పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి, మహిళ దినోత్సవం, 20న వారోత్సవాలు ముగింపు తోపాటు బహుమతుల ప్రధానం చేస్తామన్నారు.

రైల్వేస్టేషన్ మాస్టర్‌గా కిరణ్‌కుమార్


కిరణ్‌కుమార్

పాలకొండ : ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వేలో జరిగిన ఉద్యోగ నియామకాల్లో పాలకొండ చినకాపు వీధికి చెందిన టంకాల కిరణ్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాల్లో స్టేషన్ మాస్టర్‌గా నియామకమయ్యారు. కిరణ్ కుమార్ స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం పొందడంతో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం అభినందించారు.

పాస్టర్ కుటుంబానికి టిడిపి పరామర్శ


కుటుంబ సభ్యులతో మాట్లాడతున్న భూదేవి

సీతంపేట : మండలంలోని చినపల్లంకి పంచాయతీ బర్న గామానికి చెందిన పాస్టర్ ఆరిక సుబ్బయ్య ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందగా విషయం తెలుసుకున్న పాలకొండ టిడిపి నాయకులు పడాల భూదేవి అవలంగి సర్పంచ్ శ్రీరాములునాయుడుతో కలసి శనివారం పాస్టర్ కుటుంభాన్ని పరామర్శించారు. కుమారులు చిన్నారావు, ఆనందరావు, భార్య ఆరిక గంగమ్మలతో మాట్లాడుతూ క్రైస్తవ సంఘ సేవకునిగా గిరిజన ప్రాంతాల్లో అనేక సేవలు అందించిన సుబ్బయ్య అకాలమరణం విచారకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. పరామర్శలో బిడ్డిక లచ్చుమయ్య, గిరిజన యువజన నాయుకులు యస్. మోహన్ పాల్, ఊయక అప్పారావు, యస్. బాలరాజు తదితరులు ఉన్నారు.

జగదీశ్వరి అరెస్టుపై టిడిపి నిరసన


రోడ్డుపై బైఠాయించిన టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురం : ఏనుగుల దాడిలో శుక్రవారం రాత్రి మృతి చెందిన దాసరి గోవింద్ మృతదేహాన్ని చూసేందుకు పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి వెళుతున్న కురుపాం టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరిని ఎర్రన్నగుడి వద్ద గరుగుబిల్లి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు స్టేషన్‌కు వెళ్లి జగదీశ్వరిని విడిపించారు. అనంతరం అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద టిడిపి శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఏనుగుల దాడుల నుంచి ప్రజలను రక్షించాలని, మృతుని కుటుంబానికి రూ.50లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, జగదీశ్వరి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో రేడియోలు పంపిణీ


రేడియోలను పంపిణీ చేస్తున్న అధికారులు

మక్కువ : సిఆర్‌పిఎఫ్ 198వ బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం ఆ బెటాలియన్‌లో రేడియోలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ రాజ్‌కు మార్ మజిలియా మాట్లాడుతూ పోలీసులకు ప్రజలకు మధ్య దూరం లేకుండా ప్రజలతో మమేకమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంఘవిద్రోహ శక్తులకు నిరుపేద గిరిజనులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ చంద్రపాల్ ఓస, ఎస్ఐ కె పైడిరాజు, 198 బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో వైద్యుల కొరత లేదు

ప్రజాశక్తి - భామిని

పార్వతీపురం మన్యం జిల్లాలోని 38 వైద్య కేంద్రాలలో కేంద్రానికి ఇద్దరు చెప్పున వైద్యులు సేవలు అందిస్తున్నారని, హైజీనిక్ కండిషన్‌లో పూర్తి స్థాయిలో ప్రాథమిక వైద్య కేంద్రాలు ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని ఎక్కడా వైద్యుల కొరత లేదని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బి. జగన్నాథరావు తెలిపారు. మండలంలోని బాలేరు, భామిని, బత్తిలి పిహెచ్‌సిలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీ వార్డ్, ల్యాబ్, వాక్సిన్ నిల్వలు, వైద్య పరికరాలు, రికార్డులు, ఒపి సేవలు, పిహెచ్‌సి పరిసరాలను, బొడ్డగూడ సచివాలయం పరిధిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నిర్వహణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రతీ వైద్య కేంద్రంలో ఇద్దురు చెప్పున వైద్యులు ఉండే విదంగా వైద్య నియామకాలు చేశామని, వైద్య కేంద్రంలో డాక్టర్ రిక్రూట్మెంట్ అయితేనే పిజి వైద్యులును వైద్య కేంద్రం నుండి రిలీవ్ చేస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మండలంలోని అన్ని సచివాలయం పరిధిలో డాక్టర్ సమక్షంలో వైద్య బృందంచే 15 రకాలు రాపిడ్ టెస్టు, 67 రకాల మందులును అందుబాటులు ఉంచి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతీ వైద్య కేంద్రానికి అవసరాలకు రూ.1.50లక్షలు బడ్జెట్ మంజూరు చేశామని, మండల పరిధిలో సిహెచ్‌సి ఏర్పాటు అంశం పరిశీలించాలని ఎమ్మెల్యే కళావతి తెలిపారని, ప్రజలు వైద్య కేంద్రాలుకు వచ్చి ఉచితంగా వైద్యం చేసుకోవాలని, వైద్య కేంద్రాలలో సదుపాయాలు మెరుగుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, వైద్యులు ఫణి కుమార్, సోయల్, దీపికరాణి, శివకుమార్, రవీంద్ర, సిహెచ్ఒ భాస్కర్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంఅండ్ హెచ్ఒ జగన్నాధరావు


వైద్యులతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ జగన్నాధరావు

కోనలో గడపగడపకు

మక్కువ : మండలంలోని కోన పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పాల్గొన్నారు. కోనలో గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి అండగా నిలబడాలని రాజన్న దొర కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, వైసిపి మండల నాయకులు రంగునాయుడు, స్థానిక సర్పంచ్ మహాలక్ష్మి, ఎంపిడిఒ దేవకుమార్, ఎస్ఐ పైడిరాజు, పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సవరభాష అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆదివాసీల సవర భాష లిపి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని అక్షర బ్రహ్మ సేవా సంఘం వ్యవస్థాపకులు కద్రక కామేశ్వరరావు కోరారు. మండలంలోని రుషిని కాలనీ వద్ద ఆదివాసీ గిరిజనులు నిర్మాణం చేపట్టిన అక్షర బ్రహ్మ దేవాలయం వద్ద 45 రోజుల పాటు దీక్షా కార్యక్రమాలు, సవర భాష లిపి ప్రాధాన్యత, ఆదివాసీ అభివృద్ధికి తీసుకోవాల్సిన నిర్ణయాలు కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. అంతరించిపోతున్న ఆదివాసీల భాష, సంస్కృతి, సాంప్రదాయాలు పరిరక్షించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆంధ్రాలో 70 గ్రామాలు, ఒడిశాలో వంద గ్రామాల్లో అక్షర బ్రహ్మను ఆదివాసీలు ఆరాధిస్తున్నారని చెప్పారు. 1936లో 24 అక్షరాల ఉన్న సవరలిపి సృష్టించబడిందన్నారు. ఈ లిపితోనే ఆదివాసీల జీవన విధానం ముడిపడి ఉందన్నారు. నేటి తరం యువత భాషా లిపి సాంప్రదాయాలను కొనసాగించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

సవర భాష విద్యాబోధనకు వాలంటీర్లను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, సభ్యులు బి.అడ్డాయి, కేశవరావు, రవి దాసు, గుణ సాయి, విశ్వనాథం,చిన్నారావు తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

17 నుంచి సంకిలి ఫ్యాక్టరీ క్రషింగ్

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 17న సంకిలి షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభిస్తున్నట్లు ఎజిఎం జి.అప్పారావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సంకిలి ఫ్యాక్టరీ మద్దతు ధర రైతులకు టన్నుకు రూ.2793 ఇస్తుందన్నారు. 35 కిలోమీటర్ల లోపు నిర్వహణ ఖర్చులు రైతే భరించాల్సి ఉంటుందన్నారు. ఆపైన యాజమాన్యం భరిస్తుందని తెలిపారు. అలాగే కొత్తగా చెరుకు నాటే రైతులకు రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో ఎ.గొట్టవలస, బూర్జ, నిడగళ్లు గ్రామాల్లో చెరుకు సరఫరా చేసేందుకు కాటాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే లక్ష్మీపురం, కారాడలో కాటాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎస్.వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు గ్రంథాలయ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రతిరోజు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థుల విజ్ఞానం కోసం పెంపొందిందని ఈ పోటీల్లో అంతా పాల్గొని కోరారు

న్యుమోనియాపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా మండలంలోని గుచ్చిమిలో జిల్లా ఇమ్యునైజేషన్ ఇంఛార్జి అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు న్యుమోనియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక సచివాలయంలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి తదుపరి ఈ న్యుమోనియా లక్షణాలను, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తొలుత ఐదేల్లలోపు పిల్లల్లో ఈ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం సాన్స్ (SAANS) ప్రోగ్రాం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఐదేళ్లలోపు పిల్లల గృహ సందర్శనలు చేసి ఈ వ్యాధి లక్షణాలను గుర్తించాలన్నారు. తద్వారా వారికి త్వరితగతిన చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చున్నారు. వ్యాది లక్షణాలైన శ్వాస ఎక్కువ సార్లు త్వరగా తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు డొక్కలు కడల్చడం, గురక పెట్టడం, అధిక జ్వరం, జలుబు, దగ్గు మొదలైవన్నారు. సాన్స్ ప్రోగ్రాం ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని శిశు మరణాలను నివారించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శిరీష, ఉషారాణి, సూపర్‌వైజర్ భవానీ, వైద్యసిబ్బంది, 104 సిబ్బంది దుర్గారావు, ప్రసాద్ పాల్గొన్నారు.


మట్లాడుతుతున్న ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు

జగనన్న లేఅవుట్లను పరిశీలించిన జనసేన

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పాలకొండ జనసేన పార్టీ నాయకులు శనివారం జగనన్న అర్బన్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడికక్కడ ఇళ్ల స్కామ్‌లను బహిర్గతం చేయాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పాలకొండ మండలం లూంబురు గ్రామం పరిధిలో ప్రభుత్వం సేకరించిన స్థలం కొనుగోలులోనే భారీ అక్రమాలు చోటు చేసుకున్నయాని ఆరోపించారు. ఇళ్ళు నిర్మిచకపోతే పట్టా రద్దు చేస్తామని అధికారులు లబ్ధిదారులను బెదిరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకొండ జనసేన నాయకులు పోరెడ్డి ప్రశాంత్, పొట్నూరు రమేష్, జానీ, బోర వాసు, అనిల్, ఈశ్వర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని పేదలకు పంపిణీ చేసిన జగనన్న ఇళ్ల స్థలాల్లో ఒక ఇల్లు కూడా నిర్మించలేదని స్థానిక జనసేన పార్టీ నాయకులు ఎం. పుండరీకం, జానీ, వావిలపల్లి నాగభూషన్ ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తలపెట్టిన జగనన్న ఇల్లు పేద ప్రజల కన్నీళ్లు అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కాలనీను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల కిందట అచ్చుప వలస గిరిజన గ్రామం వద్ద 403 మంది లబ్ధిదారులతోపాటు మండల వ్యాప్తంగా వెయ్యి మందికి వివిధ గ్రామాల్లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని ఇంతవరకు ఎక్కడ కూడా ఒక గృహ నిర్మాణం కూడా పూర్తి కాలేదని ఆరోపించారు.


పాలకొండ: నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

సంధ్యారాణి ఏం చేశారో చెప్పాలి?

ప్రజాశక్తి- సాలూరు రూరల్

తమ ప్రాంతానికి ఎమ్మెల్సీగా గుమ్మడి సంధ్యారాణి గతంలో ఏమి చేశారని వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం మామిడిపల్లి మూడు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ ఇటీవల టిడిపి నాయకులు అన్నా క్యాంటీన్ నిర్వహించి వారు చేసిన ఆరోపణలు ప్రజలు నమ్మరన్నారు. వారికి నచ్చినట్లు పేపర్‌లో రాయించుకోడం మంచి పద్దతి కాదని, గతంలో తాము ప్రతిపక్షంలో వున్నప్పుడు సమస్యలపైనే మాట్లాడేవాళ్ళమని, వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేయకూడదని అన్నారు. తాము టిడిపిలా జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి పథకంలో ప్రతి లబ్ధిదారుల వద్ద కమీషన్లు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు సువ్వడ గణేష్, స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ, దండి అనంత కుమారి, తోనాం సర్పంచ్, మువ్వల ఆదయ్య, పెద్దింటి మాధవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దండి శ్రీనివాసరావు

నడిమికెల్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎం. దేవి వరప్రసాదరావులు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డోకల సుజాత, సూపర్‌వైజర్ శాంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దబ్బగెడ్డలో ఫ్యామిలీ డాక్టర్

మక్కువ : మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.హమేష్ రోగులకు తనిఖీలు చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 50 మందికి మందులు పంపిణీ చేశారు అలాగే ఫిట్స్ రోగులకు నెలవారీ ముందులను అందజేశారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి పౌష్టికాహారం అందుతున్న విధానాన్ని అంగన్వాడీ టీచర్ కాంచనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న వైద్యులు రమేష్

కుమ్మరవలసకు రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ జలాశయం వల్ల సర్వం కోల్పోయిన కుమ్మరవలస నిర్వాసిత గ్రామానికి రహదారి నిర్మాణాలు చేపట్టాలని గిరిజన సంఘం నాయకులు దీసరి వసంతరావు, సూకురు లక్ష్మణరావు, కె.బుచ్చిరాజు, సోములు సన్యాసి కోరుతున్నారు. రోడ్డు మరమ్మతులపై అనేకసార్లు అధికారులకు, పాలకులకు విన్నవించినా స్పందించలేదు. దీంతో గ్రామస్తులంతా ఐక్యమై కొంత డబ్బు కూడబెట్టి శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2006లో పెద్దగెడ్డ జలాశయంలో భూములు, ఇళ్లు కోల్పోయామని, ఆ సందర్భంగా అధికారులు ప్రభుత్వం మా గ్రామానికి తారు రోడ్డు వేస్తామని హామీలు ఇచ్చినా నేటికీ పరిష్కారం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో తీవ్ర అవస్థలుపడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పెద్దగెడ్డ జలాశయానికి సాగునీటి కోసం భూములు, ఇళ్లను కోల్పోయి త్యాగం చేసినటువంటి ఈ నిర్వాసితులకు రహదారి, కనీస సౌకర్యాలు లేకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ఎర్రోడ్లువలస మీదుగా ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డును బాగు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు.

శ్రమదానంతో మరమ్మతులు


నిరసన తెలుపుతున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

సరుకులు అందజేత

ప్రజాశక్తి- భామిని

అనారోగ్యంతో ఉన్న కుటుంబానికి దాతలు నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకున్నారు. గతంలో 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన దాతలు సహాయం కోసం ఎదురు చూపులు అనే కథనానికి భామిని సన్యాసిరావు స్నేహితులు స్పందించి శనివారం 23రకాల నిత్యావసర సరుకులు, 15కేజీల బియ్యంను బాధిత కుటుంబ సభ్యులు బిడ్డిక ఆదమ్మకు అందజేశారు. ఆదమ్మ భర్త అంథత్వంతో పాటు వృద్ధాప్యంతో బాధపడగా, అనారోగ్యం ఉన్న కొడుకుతో కనీసం పింఛన్ కూడ లేక తీవ్ర ఇబ్బందులతో ఉన్న ఆమెకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ మేరకు దాతలకు ఆదెమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన బాదుడే బాదుడు

పార్వతీపురంరూరల్ : మండలంలోని బాలగొడబలో శనివారం నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో బాదుడేబాదుడు కార్యక్రమం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసి, కరెంటు, నిత్యావసర, చెత్తపన్నులతో పాటు, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, గర్భాపు ఉదయభాను, కొల్లి తిరుపతి, బోను చంద్రమౌళి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గృహ లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల లక్ష్యసాధన కోసం పూర్తిస్థాయిలో అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద మున్సిపాల్టీ పరిధిలోని జగనన్న గృహ లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కమిషనర్ జె.రామ అప్పల నాయుడు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి సమీక్షించారు. ఈ సమీక్షలో మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నిర్మాణ దశలో ఉన్నాయి, ఇంకా ఎంతమంది పనులు ప్రారంభించా లి, ఇంకా ఎంతమందికి స్థలం మంజూ రు చేయాలి, ఇళ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలి, లబ్ధిదారులతో ఏ విధంగా నిర్మాణ పనులు చేయించే బాధ్యతలు తీసుకోవాలి తదితర అంశాలపై సమీక్షించారు. గృహ నిర్మాణాల లక్ష్యసాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. గృహ నిర్మాణాల విషయంలో ముందుకు రాని లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని, నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్న వారిని ప్రోత్సహించా లని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశం లో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

సాలూరు : ఈనెల 26,27 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు డి.పండు, డివిజన్ నాయకులు వరుణ్ కోరారు. శనివారం వారు బంగారమ్మపేటలోని ఎస్టీ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురంలో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ విద్యా విధానంలో భాగంగానే జీవో నెంబర్ 117, బైజూస్ ఒప్పందాలను అమలు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని చెప్పారు. విద్య కాషాయికరణే ధ్యేయంగా బిజెపి కుట్రలు చేస్తోందని చెప్పారు. విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలే లక్ష్యంగా కార్యాచరణ జిల్లా మహాసభల్లో చర్చించనున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వరుణ్, పింకీ పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఢీకొన్న వాహనం

ప్రజాశక్తి -భామిని

భామిని ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం శనివారం తెల్లవారు జాము 3 గంటలకు బత్తిలి వైపుగా వెళ్తున్న భారీవాహనం ఢీకొనడంతో విగ్రహం కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక అంబేద్కర్ యూత్ బత్తిలి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీతారాములు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ సభ్యులు లోపింటి రాజేష్, సంజీవు, గేదల మోహన్,రవి, గిరిజన సంఘం నాయకులు కొండగొర్రి భాస్కర్ రావు, సి పి ఎం మండలం కన్వీనర్ జగన్నయకులు ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా రోడ్డు విస్తరణ చేసి, కూడలిలో విగ్రహం ఏర్పాటు చేసేలా చూడాలని, కూడలిలో విగ్రహ పరిశీలనకు వచ్చిన ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలానికి వినతిపత్రం అందించారు.


ధ్వంసమైన విగ్రహం